క్లుప్తంగా

సన్మానం



వెంకటేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన దొడల వెంకటేశ్ యాదవ్ ప్రభుత్వ పాలన శాస్త్రం పంచాయతీ రాజ్ వ్యవస్థపై పరిశోధన చేశాడు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్ పట్టా పొందాడు. ఈ మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి వెంకటేశ్‌యాదవ్ స్వగృహానికి వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌అప్ప, అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



రాచన్నను పరామర్శిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

శంకర్‌పల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కల్కోడా గ్రామ మాజీ సర్పంచ్ రాచన్నను బుధవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలను గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం కల్పించారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు

కాంగ్రెస్ నేత పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

షాద్‌నగర్: కొందుర్గు మండలంలో మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ నేత పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో కొందుర్గు మండలానికి మూడు అంగన్‌వాడీ భవనాలు, రహదారులు, వంతెల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు కొనసాగుతుండటంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వారి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. శ్రీరంగాపూర్, చెరుకుపల్లి, వెంకిర్యాల గ్రామాల్లో రూ.36 లక్షలతో అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఉత్తరాసిపల్లి, టేకులపల్లి గ్రామాల వద్ద రోడ్డు మరమ్మతులకు రూ.1 కోటి 26 లక్షలు, తంగెళ్లపల్లి, చింపోడ్ గ్రామాల మధ్య వంతెన మరమ్మతులకు రూ.1 కోటి 98 లక్షలు, రేగడిచిల్కమర్రి, తంగెళ్లపల్లి, గంగన్నగూడ రహదారుల పరిధిలో కల్వర్టులు, చిన్న వంతెల మరమ్మతులకు రూ.1 కోటి 36 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

క్రికెట్‌లో సత్తాచాటుతున్న సాయిచరిత్



ప్రతిభ కనబరిచిన సాయిచరిత్

చేవెళ్ల: షాబాద్ మండలం నాగర్‌గూడకు చెందిన జోగు సాయిచరిత్ క్రికెట్ అండర్-14 విభాగంలో సత్తాచాటుతున్నాడు. చిలుకూరు పరిధిలోని రాహుల్ క్రికెట్ గ్రౌండ్‌లో నోబెల్ వర్సెస్-హైదరాబాద్ అకాడమీ జట్ల మధ్య ఇటీవల జరిగిన టీ 20 మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడని కోచ్ ప్రవీత్ తెలిపారు. నోబెల్ టీం తరఫున ఆడిన సాయిచరిత్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడన్నారు. దుబాయ్ వేదికగా గత జనవరిలో జరిగిన అండర్- 16 క్రికెట్‌లో పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్ జట్లతో తలపడి మంచి ప్రదర్శన ఇచ్చాడని తెలిపారు. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్న సాయిచరిత్ బండ్లగూడ జాగీర్‌లోని ఓ కార్పొరేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనం నుంచే అతని ఆసక్తిని చూసి క్రికెట్‌లో ప్రోత్సహిస్తున్నామని తండ్రి అశోక్ తెలిపారు.

సిబ్బంది లేక.. పనులు సాగక

- బదిలీపై తహసీల్దార్, పదోన్నతిపై ఎంఆర్ఐ
- డిప్యూటేషన్‌లో మరికొందరు..
- కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనం
- ముందుకు సాగని ఫైళ్లు



ఎంఆర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

కొందుర్గు: సిబ్బంది లేమితో తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోతోంది. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం వచ్చే వ్యాపారులు, రైతులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో పనులు గాక.. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

పనులు సాగక ఇబ్బంది

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మరికొందరు అధికారులు సైతం బదిలీపై వెళ్లడంతో పనులు మరింత ఆలస్యం అవుతున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న ఎంఆర్ఐ శివకుమార్‌కు డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి లభించడంతో ఆగస్టు 4న వికారాబాద్ జిల్లాకు వెళ్లారు. అదేవిధంగా తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఆగస్టు 25న బదిలీపై తలకొండపల్లి వెళ్లారు. ఇక ఆర్ఐ రాజశేఖర్ గత మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాగా కొందుర్గు తహసీల్దార్ కార్యాలయానికి నూతన తహసీల్దార్‌గా బదిలీ అయిన రాజేందర్‌రెడ్డి ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. అదేవిధంగా షాద్‌నగర్ ఆర్డీఓ ఆఫీస్ నుంచి ప్రవీణ్‌కుమార్, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి రోజాను కొందుర్గు ఆర్ఐలుగా డిప్యూటేషన్ వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎవరు ఇంతవరకు విధుల్లో చేరలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి.

ఎక్కడ ఫైళ్లు అక్కడే..

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో ప్రజలకు సరైన సేవలు అందడం లేదు. విద్యార్థుల కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్ఐ లేకపోవడంతో ఈ సర్టిఫికెట్ల జారీ కోసం విచారణ కష్టంగా మారింది. అదేవిధంగా పట్టాదారు మరణిస్తే వారసులు సదరు భూమిని తమ పేర్లపై పట్టా మార్పిడి చేయడం కోసం స్లాట్ బుక్ చేసుకొని నెలలు గడుస్తున్నా విచారణ చేసే అధికారులు లేక ఎక్కడి ఫైళ్లు అక్కడే నిలిచిపోయాయి. అదేవిధంగా లీగల్‌హేర్, నాలా సర్టిఫికెట్ తదితర ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న సదరు పత్రాలు ఇవ్వడానికి అధికారులు లేకపోవడం సర్వసాధారణంగా మారింది. చివరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు సైతం నేటికీ పరిష్కారం కాలేదు. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 15 రోజుల క్రితం కార్యాలయాన్ని సందర్శించి.. సిబ్బంది కొరత విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడారు. కార్యాలయంలో సరిపడా సిబ్బందిని నియమించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. కానీ ఫలితం దక్కలేదు. ఇక కార్యాలయంలో సరిపడా సిబ్బంది వచ్చేదెప్పుడో.. ప్రజల కష్టాలు తీరేదెప్పుడో వేచి చూడాల్సిందే.



కొందుర్గులో తహసీల్దార్ లేక మూసి ఉన్న ఛాంబర్

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముడిమ్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గోనే కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శేరి రాజు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ శేరి స్వర్ణలతదర్శన్, వార్డుసభ్యులతో పాటు గ్రామ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసుకుంటూ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ముడిమ్యాలలో కాంగ్రెస్, బీజేపీలను ఖాళీ చేస్తూ పార్టీలో భారీగా చేరికలు కావటం సంతోషకరమని, దీనికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అభినందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటంతో ఈ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో మళ్లీ ప్రజలు బీఆర్ఎస్ పార్టీనే కావాలని కోరుకుంటున్నారన్నారు. పార్టీలోకి చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలంయాదవ్, బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, వార్డుసభ్యులు, మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, అరీఫ్, రాంప్రసాద్, మాధవ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల మండల కన్వీనర్ మహేశ్

కేశంపేట: ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఇంటింటికీ తీసుకెళ్లాలని బీజేపీ స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింహాయాదవ్‌తో పాటు మహేశ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలను అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పదేళ్ల పాలించి అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, తట్టెపల్లి నర్సింహ, కోశాధికారి పాలాది శ్రీనివాస్, సీనియర్ నాయకులు కుమారస్వామి, యాదగిరిగౌడ్, పాండు, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్, శివ, రాఘవేందర్, శ్రీనివాస్‌గౌడ్, గణేశ్, రాజేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాల కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

షాద్‌నగర్: పట్టణంలోని క్రిస్టియన్ కాలనీ, భాగ్యనగర్ కాలనీల్లో యూటీఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.2.16కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బస్వం, కృష్ణారెడ్డి, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, ఖదీర్, నరేశ్, రాజు, సూర్యప్రకాశ్, ముబారక్, మసూద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలి

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్ అజాంఅలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) గ్రామంలోని పలు సర్వే నంబర్ల నుంచి వెళ్తున్నట్టు తెలిసిందన్నారు. ఈ సర్వే నంబర్లలో గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. తాము పాడిపరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలన్నారు. లేకుంటే ఆర్ఆర్ఆర్‌కు ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ భూములను అప్పగించమన్నారు. ప్రాణాలనైనా వదులుకుంటామని, భూములను మాత్రం వదులుకోలేమని తేల్చి చెప్పారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు



చేవెళ్ల: న్యూ జర్నలిస్ట్ కాలనీలో వినాయకుడి శోభాయాత్రలో చిన్నారులు



షాద్‌నగర్: పద్మావతీకాలనీలో గణనాథుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



నందిగామ:చాకలిదానిగుట్ట తండాలో..

ఉండ్రాలయ్యా.. దండాలయ్యా

వినాయక నవరాత్రి ఉత్సవాలు షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. 8వ రోజు బుధవారం బొజ్జ గణపయ్యకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలు, ఉండ్రాళ్లు స్వామివారికి నైవేద్యంగా సమర్పించి జయములివ్వు గణేశా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.



చేవెళ్ల: పూజలో పాల్గొన్న మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, వైద్యులు



షాబాద్: మల్లారెడ్డిగూడలో వినాయకుడి శోభాయాత్రలో గ్రామస్తులు



చేవెళ్ల: హౌసింగ్‌బోర్డు కాలనీలో..



మొయినాబాద్‌రూరల్: బాకారంలో..



మొయినాబాద్: సురంగల్‌లో..

ఆశవర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు

కొత్తూరు: ఆశవర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం.. వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబు ఆరోపించారు. బుధవారం కొత్తూరులో ఆశవర్కర్లతో మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆశవర్కర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరీ, ప్రధాన కార్యదర్శిగా బుజ్జి, కోశాధికారిగా నవనీత, సహాయ కార్యదర్శురాలిగా అనిత, ఉపాధ్యక్షులుగా ఇందిరా, వసంత, సభ్యులుగా లక్ష్మీ, కవిత, మహేశ్వరీ, లక్ష్మీ, శ్రీవాణి, కమల, అనిత తదితరులను ఎన్నుకున్నారు.

పంటల నమోదు తప్పనిసరి

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా బుధవార ం ఆమె మాట్లాడుతూ.. పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసినట్లయితే పంటలు విక్రయంచేందుకు సులభతరం అవుతుందన్నారు. పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు వీలుంటుందని తెలిపారు. ఆయా గ్రామాల అధికారుల వద్ద పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆకుకూరలు కోసే రోబోటిక్ యంత్రం ఆవిష్కరణ

మొయినాబాద్: సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. వ్యవసాయ పనుల్లోకి ఇప్పటికే అనేక యంత్రాలు వచ్చాయి. వాటికి తోడు ఇప్పుడు ఆకుకూరలు కోసి, కట్టలు కట్టే రోబోటిక్ యంత్రం(హార్వెస్టర్) రాబోతోంది. మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ యంత్రాన్ని రూపొందించారు. ఇటీవల రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అగ్రిహబ్‌లో ఆకుకూరలు కోసి, కట్టలు కట్టే రోబోటిక్ యంత్రాన్ని ప్రదర్శించారు. దీనికి యూనివర్సిటీ ఇంక్యుబేటర్‌లో చోటు కల్పించి ఆధునీకరించి అంకురాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. యంత్రాన్ని తయారు చేసిన విద్యార్థులను, ప్రోత్సాహం అందించిన కేజీరెడ్డి కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్లను ఆయన అభినందించారు. ఈ యంత్రాన్ని మార్కెట్‌లోకి విడుదల చేయడానికి రూ.40 లక్షల పెట్టుబడి నిధిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీరెడ్డి కళాశాల విద్యార్థులు ఆకుకూరల కోత కోసం తయారు చేసిన ఆటోమేటిక్ రోబోటిక్ యంత్రం కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదని.. వ్యవసాయ సాంకేతికతలో ముందడుగుకు నిదర్శనమన్నారు. యువ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తే.. వారు రేపటి వ్యవసాయ భవిష్యత్‌ను నిర్మిస్తారన్నారు.



రోబోటిక్ యంత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య

ఘనంగా కళా ఉత్సవ్ పోటీలు



శంకర్‌పల్లి: గ్రూప్ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

శంకర్‌పల్లి: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మండలస్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయిలో సోలో డ్యాన్స్, గ్రూప్ డ్యాన్స్, సోలో సింగింగ్, ఆర్ట్ పోటీలు నిర్వహించారు. సోలో డ్యాన్స్, ఆర్ట్ పోటీల్లో మహారాజ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన హాస్యప్రియా, అనూష ప్రథమస్థానం, గ్రూప్ డ్యాన్స్, సోలో సింగింగ్‌లో మోడల్ స్కూల్‌కి చెందిన వైష్ణవి గ్రూప్, నీరజ ప్రథమస్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలను జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా సీఆర్పీలు రాజశేఖర్, శ్రీనివాస్ వ్యవహరించారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: కొత్తూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలు పాఠశాలల విద్యార్థులకు బుధవారం మండలస్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. నృత్యం, గానం, నాటికలు, గ్రూప్ నాటికలు, స్టోరీ టెల్లింగ్, ఆర్ట్స్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం రవికుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, భగవంతు, శ్రీనివాసులు, లీలారాణి, పద్మజ, నవనీత, పుష్పలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు